# పర్సనల్ వర్క్

– శ్రీపతి పండితారాధ్యుల పార్వతీశం

''హలో! ఎవరు కావాలండీ?'' అప్పుడే రింగ్ అయిన టెలిఫోన్ రిసీవరు తీసుకొని అడిగారు ఉమాశంకరంగారు.

''క్రిష్ణప్రసాద్ వున్నారాండీ?'' అడిగింది అవతలినుంచి ఒక స్త్రీకంఠం.

''ముందు మీరెవరో, మీపేరేమిటో చెప్పండి'' కొంచెం కోపంగా అడిగారు ఉమాశంకరం గారు గొంతులో ఏదో శంకను కూడా ధ్వనిస్తూ.

''మీరు క్రిష్ణప్రసాద్ వాళ్ల నాన్నగారాండీ'' అడిగింది అవతలి అమ్మాయి.

''అవును వాళ్ల నాన్ననే మాట్లాడుతున్నాను. ఇంతకూ మీరెవరు? మీకు మా అబ్బాయితో పనేమిటి?'' మళ్లీ అసహన భావంతోనే అడిగారు ఉమాశంకరంగారు.

''నేను మీ అబ్బాయి పనిచేసే ఆఫీసులోనే పనిచేస్తున్నాలెండి. మీ అబ్బాయిగారితో కొంచెం పర్సనల్గా మాట్లాడాలి. ఇంతకూ క్రిష్ణప్రసాద్ అసలు ఇప్పుడు వున్నారా లేదా దయచేసి చెప్పండి'' అడిగింది ఎంతో అణకువగా. ఉమాశంకరంగారికి చిర్రెత్తుకొచ్చింది.

''ఇదిగో అమ్మాయ్ నీ ధోరణి నాకేం బాగుండ్లేదు. మా అబ్బాయి కొలీగ్ అంటున్నావు. మా అబ్బాయితో పర్సనల్గా మాట్లాడాలంటున్నావు. అసలు అంత పర్సనల్ వర్క్ మా అబ్బాయితో నీకు ఏముంది? ఇంతకూ నీకు అసలు పెళ్లయిందా లేదా? అది చెప్పు ముందు. ఆ తర్వాత మా అబ్బాయి ఇంట్లో వున్నాడో లేదో చెప్తాను'' చాలా కటువుగా అన్నాడు ఉమాశంకరం.

ఏమనుకుందో ఏమో అవతలి అమ్మాయి ఫోను పెట్టేసింది. ఉమాశంకరం వెయ్యి అనుమానాలతో కుతకుతలాడుతూ ఏమీ చెయ్యలేక రిసీవర్ పెట్టేశాడు.

ఉమాశంకరంగారు ఒక లాయరు. ప్రతి విషయంలోను ఎంతో ప్రిన్స్‌పుల్డ్‌గా వుంటారు. లాయర్ అయినవాడు లైయర్ కూడా అయి వుండాలి– ఆర్జించాలంటే అనే ఒక హాస్యపూర్వక చేదు నిజానికి అపవాదం ఉమాశంకరంగారు. తన నీతి నియమాల నిబద్ధత, నిజాయితీ, సత్యసంధత వంటి కొన్ని ప్రిన్సిపుల్స్ తన ధనార్జనా పురోగతికి ఆటంకాలని తను న్యాయవాద వృత్తి ప్రారంభించినప్పుడే గ్రహించాడు. అయినా, తాను గాఢంగా విశ్వసించిన జీవన నైతిక సూత్రాలకు కట్టుబడి మాత్రమే తాను తన న్యాయవాద వృత్తిని కొనసాగిస్తూ వస్తున్నారు.

వృత్తి విషయంలోనే కాదు– తాను వైయక్తిక విషయాల్లో కూడా చిన్నప్పటినుంచి ఎంతో పరిశుద్ధమైన ప్రవర్తనను అలవాటు చేసుకున్నారు. బ్రహ్మచారి దశలో నూటికి నూరుపాళ్లు త్రికరణశుద్ధిగా బ్రహ్మచారిగానే వుండేవారు.

• • •

సుమారు ఒక ఇరవై అయిదేళ్ల క్రిందటి మాట. తాను తన రీడింగ్ రూములో కూర్చొని ఏవో లాబుక్స్ రిఫర్ చేసుకుంటున్నాడు ఉమాశంకరం.

''బావా!'' అంటూ ఆ రూమ్‌లో అడుగుపెట్టింది అమల. అమల ఎవరో కాదు. ఇంకో నెలరోజులలో తన అర్ధాంగి కాబోతున్న తన మేనమామ కూతురు.

''ఆ ఏమిటి'' ఏమీ పట్టనట్టు తన పుస్తక లోకం లోంచి బయటకు రాకుండానే, తలనైనా ఎత్తకుండానే కేవలం మెకానికల్గా అడిగాడు.

అమల ముఖం చిన్నబోయింది. అందాల అపరంజి బొమ్మ అయిన అమల– సాక్షాత్తు ఒక నెలరోజులలో అతనికి ధర్మపత్ని కాబోతున్న అమల– అలా వరూధిని పొందిన నిరాదరణ లాంటిది తానూ పొందినట్లు ఫీలయింది.

అయినా అమల కొంచెం తమాయించుకుంది.

''ఏంలేదు బావా! ఇంట్లో ఏమీ తోచటంలేదు. కాసేపు నీతో చెస్ ఆడదామని వచ్చాను. ఆడదామా'' అంది.

''ఒక్క పదినిముషాలు ఆగు. ఈ ఒక్క పాయింటూ చదివి నోట్ చేసుకున్నాక ఆడతాను. ఇదిగో అందాక ఈ రామకృష్ణ పరమహంస జీవిత చరిత్ర పుస్తకం చూస్తూ వుండు'' అంటూ తన పుస్తకాల ర్యాక్‌లోంచి ఒక పుస్తకం తీసి ఇచ్చాడు ఉమాశంకరం.

అమలకు వేపాకు తినిపిస్తున్నట్లు అనిపించింది తన బావ మాట– పని. పెళ్లి భోజనానికి వెళదామనుకుంటే శివరాత్రి ఉపవాస నియమం అడ్డంవచ్చినట్లు అనిపించింది. పోనీలే బావ ఆగమన్నది ఒక్క పదినిముషాలేగా అని సరిపెట్టుకున్నది. పుస్తకం తీసుకుని దగ్గర్లో వున్న కుర్చీలో కూర్చొని పేజీలు తిరగేయటం మొదలెట్టింది. కానీ మనసు అక్షరాల మీద లగ్నం కావటంలేదు. తనకు తెలియకుండానే లగ్నం తన కళ్లు, చూపులు బావ మీదకు మరలిపోతున్నాయి.

అందులోను బావ తనకన్న ఇంకా అందమయిన వాడు. చొక్కా లేకుండా బనియన్ తొడుక్కొని వున్నాడు. బంగారపు మేనిఛాయతో కూడిన అతని విశాల వక్షస్థలం పెద్దనగారు వర్ణించినట్లు మన్మథుని ఆస్థానపీఠమా అన్నట్లున్నది. అతని రింగుల జుట్టు ముఖంమీద వాలుతుంటే తన వ్రేళ్లతో వాటిని పక్కకుతోసి ఆ క్రాపును, అతని నుదుటిని ముద్దుపెట్టుకోవాలనిపిస్తోంది. ఇంకా ఏవో తియ్యని చిలిపి కోరికలతో అమల ఉక్కిరి బిక్కిరైపోతోంది. ఒక నాలుగైదు నిమిషాలు గడిచాయో లేదో అమల ఇక వుండబట్టలేక ఉమాశంకరం ప్రక్కనే వచ్చి అతనికి ఆనుకొని కూర్చొని ''బావ'' అంటూ తన రెండు చేతులతో అతని మెడను చుట్టేసింది. వరూధినీ ప్రవరాఖ్యం కథకు జెరాక్స్ కాపీయా అన్నట్లు ఉమాశంకరం అమలను ఒక్క విదిలింపు విదిలించి తాను లేచి నుంచున్నాడు. అమల కళ్లలో నీళ్లు తిరిగాయి. ఆ కళ్లలో బేలతనం, నిస్సహాయత, దీనత, సిగ్గు కూడా తాండవించాయి.

''సారీ అమలా! అయామ్ వెరీ సారీ! నిన్ను చిన్నబుచ్చాలని కాదు. నీమీద ప్రేమ లేకనూకాదు. పెళ్లయ్యేవరకు మనం ఇద్దరం కేవలం బంధువులం మాత్రమే. ఆత్మీయులం కూడా. కానీ ఆలుమగలం మాత్రం కాదు. ఆ పవిత్ర మంగళ సూత్రధారణ జరిగేవరకు నిన్ను కనీసం స్పృశించటం కూడా నాకిష్టంలేదు. ప్లీజ్ అండర్‌స్టాండ్ మి అండ్ మై సెలిబసీ'' అన్నాడు ఎంతో సానునయ పూర్వకంగాను, సముదాయపు స్వరంతోను సంజాయిషీ ఇచ్చుకుంటున్నవాడిలా ఉమాశంకరం.

అమల అర్థం చేసుకుంది బావ నియమబద్ధతను. ''నీలాంటివాడు బావేకాక, అతి త్వరలో భర్త కూడా అవబోతూ వుండటం నాకెంతో గర్వకారణంగా వుంది బావా! ఇక నా ముఖం జీలకర్ర–బెల్లంపెట్టి, అడ్డంకట్టిన తెర తీశాకనే నీకు కనిపిస్తుంది. లెటజ్ నీ ఈచ్ అదర్ ఎట్ దట్ స్వీట్ మూమెంట్ఓన్లీ'' అంటూ చకచకా వెళ్లిపోయింది.

• • •

అలాంటి ఉమాశంకరం మారుతున్న తరాలలోని అంతరాల గురించి, ఇప్పటి సమాజంలో మారిపోతున్న మానసిక ధోరణుల గురించి, సడలుతున్న ప్రవర్తనా క్రమశిక్షణల గురించి, జారిపోతున్న నైతిక విలువల గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నారు.

''ట్రింగ్ ట్రింగ్... ట్రింగ్ ట్రింగ్...'' మళ్లీ ఫోను. అవతలనుంచి అదే అబల కంఠం.

''ఏమ్మా తల్లీ నువ్వేనా? మా అబ్బాయి కోసమేనా? ఇందాక నేనడిగినవాటికి సమాధానాలు చెప్పకుండానే ఫోను పెట్టేశావు. ఇప్పుడు మళ్లీ ఫోను చేస్తున్నావు. అసలు ఏమిటి నీ సంగతి? మా అబ్బాయితో నీకున్న పనేమిటి?'' గబగబా పెడసరంగా, చిరాగ్గా అడిగారు ఉమాశంకరం.

''సారీ అంకుల్. పర్సనల్ వర్క్ అని చెప్పానుగదండీ! అది ఇక్కడినుంచి ఫోనులో చెప్పేది కాదు. చెప్పటం కుదరదు కూడా. పైగా ఇది మా ఆఫీసు. ఎవరన్నా వింటే ప్రమాదం. దయచేసి మీ అబ్బాయిగారు ఉన్నారో లేదో చెప్పండి. పోనీ నన్ను ఎక్కడ కలుసుకోమంటారో మీరైనా కనుక్కొని నాకు చెప్పండి'' అన్నది

అవతలినుంచి ఆ అమ్మాయి.

"ఎంత ధైర్యం నీకు!? డైరెక్టుగా నాతోనే ఇంత నర్మ గర్భంగా మాట్లాడతావా? ఇంకోసారి మా ఇంటికి మా అబ్బాయి గురించి ఫోను చేశావంటే నీ అంతు చూస్తాను. ఏమనుకున్నావే!" అంటూ ఎబ్రప్ట్‌గా ఫోను పెట్టేశారు ఉమాశంకరం.

• • •

ఆ తరువాత వరసనే నాలుగు రోజులపాటు ప్రతి రోజూ ఉదయం తొమ్మిది గంటలకల్లా ఫోను మోగేది. ఫోను మోగిన ప్రతిసారీ ఉమాశంకరం ఫోను ఎత్తటం, ఆ అమ్మాయిని నానా చివాట్లు పెట్టటం జరిగిపోయాయి.

• • •



ఇరవై రోజుల క్రిందట తన చెల్లెల్ని యూనివర్శిటీలో చేర్చటానికి విశాఖపట్నం వెళ్లిన క్రిష్ణప్రసాద్ ఆ యూనివర్శిటీ పని, ఇంకా అక్కడ చుట్టుపక్కల వున్న భీముని పట్నం, విజయనగరం, తుని, అనకాపల్లి మొదలైన ఊళ్లోని బంధువులందరి ఇళ్లు ఒకసారి చుట్టబెట్టి ఆరోజే తిరిగి వచ్చాడు. తండ్రి ఎందుకో ముభావంగా వున్నాడు. తనను ఏదో అడగాలనుకుంటూనే ఎందుకో తటపటాయిస్తున్నాడని గ్రహించాడు క్రిష్ణప్రసాద్.

"అమ్మా! నాన్న ఏమిటి అదోలా వున్నారు? మామూలుగా ఎప్పటిలాగా నాతో మాట్లాడటంలేదు. ఏమైవుంటుంది?" అడిగాడు క్రిష్ణప్రసాద్ తన తల్లిని.

"ఏమోరా నాకూ తెలియదు. అయితే ఒక నాలుగు రోజుల్నుంచి మాత్రం ఎవరో అమ్మాయిలాగుంది నీకోసం ఫోన్ చేస్తోంది. ఈయన ఆ అమ్మాయి ఫోన్ చేసినప్పుడల్లా ఫోనులో ఏదో ఝాడించేస్తున్నారు. నేను ప్రతిసారీ ఆ సమయంలో వంటపనిలో వుండి అంతగా పట్టించుకోలేదు" అని అన్నది క్రిష్ణప్రసాద్ తల్లి.

మొన్ననే నాన్నను అడుగుదామనుకున్నాడు. కానీ అప్పటికే ఉమాశంకరం కోర్టుకు వెళ్లిపోయాడు.

• • •

సాయంత్రం అయిదున్నరకు అటు ఆఫీసు నుంచి క్రిష్ణప్రసాదు, ఇటు కోర్టునుంచి ఉమాశంకరం- ఇద్దరూ వచ్చారు. తండ్రిని చూస్తూనే క్రిష్ణప్రసాద్ తన జేబులోంచి ఒక కాగితం తీసి తండ్రి చేతిలో పెట్టాడు.

"గౌరవనీయులైన అంకుల్!

నమస్తే. మిమ్మల్ని ఇక ఏ ఫోనూ విసిగించదు.

నేనూ, మీ అబ్బాయి కలిసి పనిచేసే ఆఫీసు మేనేజరు- నేను తన అనైతిక వాంఛలకు లొంగిపోలేదని నన్ను ఆఫీసు వర్క్‌లో చాలా టీజ్ చేస్తుంటే మీ అబ్బాయి నన్ను చూసి జాలిపడి లక్ష్మీ చిట్‌ఫండ్ కంపెనీలో తనకు ఎవరో కొంచెం తెలిసినవాళ్లు వున్నారని, అందులో నాకు వేరే నౌకరీ కోసం ట్రైచేద్దామని నాతో అన్నారు. దాన్ని గురించి ఇరవై రోజులక్రిందట మీ ఇంటికి నన్ను ఫోన్ చేయమన్నారు. కాని ఫోనులో మాట్లాడేటప్పుడు నేనిలా వేరే జాబ్ వెతుక్కుంటున్నానని తెలిస్తే ఊళ్లో తనకున్న పరపతి, పరిచయాలు, ఇన్ఫ్లుయన్సులతో నాకు ఆ జాబ్ కూడా దక్కకుండా చేస్తాడు మా మేనేజర్. అందుకని ఫోనులో ఆ అసలు విషయం రాకుండా నేను ఎంతో జాగ్రత్తగా మాట్లాడదామని ఎన్నోసార్లు ప్రయత్నించాను. కానీ మీరు నా పర్సనల్ వర్క్ అనేమాటను పట్టుకొని నన్ను చాలా నీచంగా ఊహించారు. అనరాని మాటలన్నారు. తరువాత తరువాత మీ టెలిఫోన్ టాక్స్‌లో మీరు చాలా ప్రిన్సిపుల్డ్ అని, మంచి డిసిప్లినేరియన్ అని, మీ పిల్లల్ని కూడా ఎన్నో కంట్రోల్స్‌లో వుంచుతారని తెలిసింది. మంచిదే. కానీ, పర్సనల్ వర్క్ అనే నా ఒక్కమాట మీకు ఎంతో ఆగ్రహాన్ని, చాలా అపార్థాన్ని తెచ్చిపెట్టింది. ఎన్నిసార్లు ఫోను చేసినా మీ అబ్బాయి సమాచారం మాత్రం మీరు నాకు చెప్పలేదు.

పోనీ నేనే మీ ఇంటికి వచ్చి అన్నీ చెబుదామనుకుంటే మీ ఇంటి అడ్రసు నాకు తెలియదు. ఫోనులో మీ అడ్రసు అడిగే అవకాశం కూడా నాకు మీరు ఇచ్చేవారు కాదు. ఫోను ఎత్తుకుంటూనే నామీద విరుచుకుపడేవారు. నన్ను అసలు మాట్లాడనిచ్చేవారే కాదు.

ఇదిలా వుండగా నిన్న ఆఫీస్ కరస్పాండెన్స్ లెటర్సు అర్జంటుగా టైప్ చేయాల్సినవి చాలా వుంటే ఆఫీసులో లేట్ అవర్స్‌లో కూర్చొని టైప్ చేస్తున్నాను. అప్పుడు రాత్రి ఎనిమిదిన్నర అయింది. ఆఫీసులో ఎవరూ లేరు మా మేనేజరు తప్ప. ఆ దుశ్శాసనుడు నన్ను బలాత్కరించబోయాడు. ఎలాగో తప్పించుకొని బయటపడ్డాను. ఈరోజు పొద్దున్నే రాజీనామా ఇచ్చేశాను.

ఈరోజే ఒంటిగంట ట్రెయిన్‌కి కార్గిల్ వెళ్తున్నాను. ట్రెయిన్‌లో అడుక్కుంటూ వెళతాను. అలా అడుక్కోగా వచ్చిన డబ్బంతా కార్గిల్ ఫండ్‌కు ఇచ్చేస్తాను. మీ అబ్బాయిగారు నాకు ఎప్పుడో ఇప్పించే ఆ చిట్‌ఫండ్ కంపెనీ నౌకరీ కంటే ఇలా అడుక్కుంటూ చేసే కార్గిల్ ఫండ్ సేకరణ పనిలోనే నా జీవితం ధన్యం అవుతుందని నాలాంటి అభాగ్యురాలి ఒకే ఒక ఆశ. వుంటాను. సెలవు మరి.

ఇట్లు

మీ క్రిష్ణప్రసాద్‌కు మానస సోదరి,

మీ ఆదర్శ జీవితం అనే ద్రోణుడికి ఏకలవ్య శిష్యురాలు,

'అనామిక'

అది చదివిన ఉమాశంకరంగారు- ఎంతో ప్రిన్స్‌పుల్డ్ ఉమాశంకరంగారు- తన రెండు చేతులతో చెంపలు గట్టిగా టపటపా వాయించుకోసాగారు. అది ఉమాశంకరంగారి పర్సనల్ వర్కింగ్ రియాక్షన్. కేవలం ప్యూర్లీ పర్సనల్.

★